కుట్ర కోరల్లో మన కాళేశ్వరం

మొదటిపేజీ తరువాయి...

కూడా కాపీ సిద్ధం చేస్తుంది.. ఇదంతా పరిశీలిస్తే కాళేశ్వరం ఎత్తిపోతలపై జరుగుతున్న కుట్ర ఏందో ఎవరికైనా అర్థమవుతుంది. ఇతర రాష్ట్రాల్లో డ్యాంలు కూలిపోతున్నాయని ప్రజలు నెత్తీనోరు మొత్తుకున్నా కుంభకర్ణుడిగా గుర్రుపెట్టిన నిద్రపోయిన డ్యాం సేఫ్టీ అథారిటీ, కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో చూపుతున్న ఆసక్తి, వేగం చూసి ఇంజినీరింగ్ నిపుణులే ముక్కున వేలేసుకొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన డాక్యుమెంట్లను పరిశీలించకుండానే నివేదిక ఇచ్చినట్టు ఉన్నదని విస్మయం వ్యక్తంచేస్తున్నారు. లోపం తలెత్తిన వారం రోజుల్లోపే సమగ్ర అధ్యయనం లేకుండా తుది తీర్పు ఇవ్వడం పలు అనుమానాలకు తావిస్తున్నదని చెప్తున్నారు.

కనీస సమయం ఇవ్వకుండానే..

గత నెల 22న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి కేంద్రానికి కాళేశ్వరంపై లేఖ రాశారు. మరుసటి రోజే (23వ తేదీన) నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) బృందం రంగంలోకి దిగింది. 24వ తేదీన మేడిగడ్డ వద్దకు వెళ్లిన ఎన్‌డీఎస్‌ఏ ఇంజినీర్ల బృందం, బరాజ్ మీదకు వెళ్లింది. అక్కడ రెండు గంటల పాటు ఉండి, స్థానిక ఇంజినీర్ల నుంచి పలు వివరాలు సేకరించింది. 25వ తేదీన జలసౌధలో తెలంగాణ సాగునీటి రంగ ఇంజినీర్లతో దాదాపు నాలుగు గంటల పాటు సమావేశమై పలు సాంకేతిక అంశాలపై చర్చించి, కొన్ని డాక్యుమెంట్లు తీసుకొన్నది. 20 అంశాలపై ఎన్‌డీఎస్‌ఏ బృందం వివరాలు కోరగా... అప్పటికప్పుడు తెలంగాణ ఇంజినీర్లు రెండు అంశాలకు సంబంధించి నివేదికలు ఇచ్చి, మిగిలిన వాటిని సమర్పించేందుకు గడువు ఇవ్వాలని కోరారు. కానీ ఎలాంటి సమయం ఇవ్వకుండానే 29వ తేదీలోగా కోరిన నివేదికలు ఇవ్వకపోతే... అందుకు సంబంధించిన సమాచారం లేదని భావించి, తుది నివేదిక ఇస్తామని 26వ తేదీ నాడే ఎన్‌డీఎస్‌ఏ తెలంగాణకు లేఖ రాయడం గమనార్హం. అయితే 29వ తేదీ నాడు కొన్ని... నవంబర్ ఒకటిన మరికొన్ని... ఇలా బృందం కోరిన 20 అంశాలకుగాను 17 అంశాలపై తెలంగాణ ప్రభుత్వం నివేదికలు ఇచ్చింది.

అధ్యయనం లేకుండానే ఎన్‌డీఎస్‌ఏ నివేదిక

- వాస్తవానికి ఒకసారి మేడిగడ్డను పరిశీలించిన ఎన్‌డీఎస్‌ఏ బృందం... బరాజ్‌లో నీళ్లన్నీ ఖాళీ అయిన తర్వాత మరోసారి క్షేత్రస్థాయికి వచ్చి పునాదిని సాంకేతికంగా పరిశీలించిన తర్వాత నివేదిక ఇస్తారని ఇంజినీరింగ్ నిపుణులు భావించారు. కానీ అందుకు విరుద్ధంగా నివేదిక ఇచ్చారు.
- తెలంగాణను 20 అంశాలపై నివేదిక కోరితే 11 అంశాలపై మాత్రమే వివరాలు ఇచ్చారని నివేదికలో పొందుపరిచారు. కానీ వాస్తవంగా తెలంగాణ నుంచి 17 అంశాలపై వివరాలు వెళ్లాయి. మరి నివేదికలో ఆరింటిని పరిశీలించకపోవటం వెనక మర్మమేమిటో వాళ్లకే తెలియాలి. పైగా పూర్తిస్థాయి వివరాలు రాకుండా, వాటిని పరిశీలించకుండానే నివేదిక ఇవ్వడం పూర్తిగా బాధ్యతారాహిత్యమని నిపుణులు మండిపడుతున్నారు.
- ఎన్‌డీఎస్‌ఏలాంటి అత్యున్నత సంస్థ నివేదిక ఇస్తే అందులో కచ్చితత్వం ఉండాలి. కచ్చితమైన కారణాన్ని పేర్కొనాలి. కానీ నివేదికలో అనేక అంశాల్లోనూ 'బహుశా' అని, 'జరిగే అవకాశం ఉన్నది' అని పేర్కొన్నారు. ఇలాగైతే ఆ స్థాయి సంస్థకు విశ్వసనీయత ఏముంటుందని ఇంజినీర్లు ప్రశ్నిస్తున్నారు.
- తెలంగాణ నీటిపారుదల శాఖ ఒకటో తేదీన కూడా కొన్ని వివరాలు పంపింది. ఎన్‌డీఎస్‌ఏ నివేదిక ఇచ్చిన తేదీ కూడా అదే. అంటే తెలంగాణ పంపిన వివరాలను పూర్తిగా చూడకుండానే నివేదిక ఇచ్చినట్టుగా తేటతెల్లమైంది. ముఖ్యంగా నివేదిక ఇలా ఇవ్వానలే ఒత్తిడి ఆ బృందంపై ఉన్నదా? లేక ముందుగానే నిర్ణయించుకున్న మేరకు నివేదిక ఇచ్చారా? అనేది తేలాల్సి ఉన్నది.
- ఇంత పెద్ద ప్రాజెక్టుపై నివేదిక ఇచ్చే సందర్భంలో ఎన్‌డీఎస్‌ఏ బృందం ఇంజినీర్లు తెలంగాణ పంపిన వివరాలు పరిశీలించి... తదుపరి సాంకేతిక సంప్రదింపులు జరపడమనేది సర్వ సాధారణం. సాంకేతిక చర్చల ద్వారానే అసలేం జరిగిందనేది తేలుతుంది. కానీ ఈ ప్రక్రియలేవీ నిర్వహించకుండా, కేవలం రెండు గంటల పరిశీలన, నాలుగు గంటల సమావేశంతోనే 43 పేజీల నివేదిక ఇవ్వడం వెనక మర్మమేమిటి?
- ఎన్‌డీఎస్‌ఏ కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని విభాగం. దాని నుంచి వెలువడే నివేదికలు ప్రభుత్వం టు ప్రభుత్వం ఉండాలి. అంటే అధికారికంగా నివేదికను తెలంగాణ నీటిపారుదల శాఖకు పంపాలి. కానీ ఇదేమీ జరగలేదు. అంతకు ముందుగానే నివేదిక బీజేపీ, కాంగ్రెస్ నేతలతో పాటు మీడియా చేతుల్లోకి వెళ్లిపోయింది. అంటే ఎన్నికల వేళ కొన్ని పార్టీలకు ప్రయోజనం చేకూర్చి... తెలంగాణ ప్రభుత్వాన్ని బద్నాం చేయాలనే కుట్ర జరిగినట్టుగా స్పష్టమవుతున్నది. కేంద్ర మంత్రి హోదాలో ఉండి కిషన్‌రెడ్డి అధికారికంగా తెలంగాణ ప్రభుత్వానికి అందని నివేదికను మీడియా ముందు బయటపెట్టడం మంత్రి మండలి నిబంధనలకు విరుద్ధమని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.
- ముఖ్యంగా నివేదికలో పిల్లర్ కుంగడానికి అనేక కారణాలు అంటూ.. 'పైపింగ్, పునాది కదలడం, బేరింగుల సామర్థ్యం సరిగా లేకపోవడం, భారీ లోడుతో అప్‌స్ట్రీమ్‌లోని సీకెంట్ పైల్స్ విఫలమవడం' అని పొందుపరిచారు. బరాజ్ పిల్లర్ కుంగడానికి కారణాలు అని గూగుల్‌లో వెతికినా, పుస్తకాల్లో అన్వేషించినా ఇవే కారణాలుంటాయి. ఇంత దానికి నిపుణుల బృందం వచ్చి ఇంత హడావుడి చేయడం అవసరమా? అంత పెద్ద సంస్థ నుంచి వచ్చిన బృందం ఓపికగా అధ్యయనం చేసి, సమగ్ర వివరాలు పరిశీలించి, క్షేత్రస్థాయి పరిస్థితులను బేరీజు వేసిన తర్వాత 'ఫలానా' కారణంతో పిల్లర్ కుంగింది అని కచ్చితంగా తేల్చాలి. అప్పుడే ఆ సంస్థకు, అది ఇచ్చే నివేదికకు విశ్వసనీయత ఉంటుందని నిపుణులు అంటున్నారు.
- తెలంగాణ ప్రభుత్వాన్ని, కాళేశ్వరం ప్రాజెక్టును అప్రతిష్టపాలు చేయడమే లక్ష్యంగా డిల్లీ పెద్దల ఆదేశాలతో నివేదికను రూపొందించినట్టుగా కనబడుతున్నది. నివేదిక అధికారికంగా రాష్ట్ర ప్రభుత్వానికి చేరకముందే మీడియాకు అందడం దేన్ని సూచిస్తున్నది?
- బరాజ్ పిల్లర్లు కుంగిపోవడానికి అనేక కారణాలున్నాయని, ప్లానింగ్, డిజైనింగ్, నాణ్యత, నిర్వాహణ లోపాలు అంటూ నివేదికలో రాయడం విచిత్రం.
- కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బరాజ్‌సహా అన్ని కాంపొనెంట్ల డిజైన్లను రూపొందించింది దేశంలోనే పేరెన్నికగన్న, డిజైన్ రంగంలో 40 ఏండ్ల సుదీర్ఘ సాంకేతిక అనుభవమున్న సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ ఇంనినీర్లు. కాళేశ్వరం ప్రాజెక్టులో నిర్మించిన 3 బరాజ్‌ల డిజైన్లను కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ), సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇరిగేషన్ అండ్ పవర్ (సీబీఐపీ) జారీ చేసిన బరాజ్ డిజైన్ మాన్యువల్స్, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ జారీ చేసిన ఐఎస్ కోడ్స్ ఆధారంగానే రూపొందించారు. ఢిల్లీలో కేంద్ర జల సంఘం డిజైన్ విభాగంలో ఉన్న ఇంజినీర్లతో అనేకసార్లు చర్చించి, వారి సూచనల మేరకు తపోవన్ ప్రాజెక్టులో బరాజ్ డిజైన్లను అధ్యయనం చేసిన తర్వాతనే కాళేశ్వరం బరాజ్‌ల డిజైన్లను ఖరారు చేశారు. బరాజ్‌లో వేసిన రాఫ్ట్‌లు, కటాఫ్ వాల్స్ అన్నీ ఐస్ కోడ్స్‌లో, బరాజ్ డిజైన్ మాన్యువల్స్‌లో నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగానే వేశారు. బరాజ్ డిజైన్లలో లోపాలుంటే డిజైన్ మాన్యువల్స్‌ను, కోడ్స్‌ను జారీచేసిన కేంద్ర సంస్థలదే తప్పు కదా?
- బరాజ్ నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదని నివేదికలో రాశారు. ఈ బరాజ్‌ను నిర్మించింది దేశంలో నాణ్యతా ప్రమాణాలకు, నిర్మాణ సమర్థతకు మారుపేరుగా ఉన్న ఎల్‌అండ్‌టీ సంస్థ. ఈ సంస్థ నిపుణులైన ఇంజినీర్ల పర్యవేక్షణలోనే ఎటువంటి రాజీ లేకుండా బరాజ్ నిర్మాణం కొనసాగింది. నాణ్యత తనిఖీ చేయడానికి సాగునీటిశాఖ ప్రతీ బరాజ్ వద్ద ఈఈ ఆధ్వర్యంలో ప్రత్యేక క్వాలిటీ కంట్రోల్ విభాగాన్ని నియమించింది. 24 గంటలు వారు పని ప్రదేశంలో ఉండి నాణ్యతను తనిఖీ చేశారు. అవన్నీ పని ప్రదేశంలో ఉండే రిజిస్టర్లలో నమోదు కూడా చేశారు. వాటిని నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటికి సమర్పించారు. అయినా వాటిని ఇవ్వలేదని నివేదికలో పేర్కొనడంలో అంతర్యమేంటి?
- కాళేశ్వరం ప్రాజెక్టు నివేదికను తయారు చేసింది కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన వాప్కోస్. ఆమోదించింది కేంద్ర జల వనరుల మంత్రిత్వ శాఖ సాంకేతిక సలహా మండలి (టీఏసీ). ఏదైనా ఒక ప్రాజెక్టు నివేదికను ఆమోదించే ముందు కేంద్ర జల సంఘం హైడ్రాలజీ, ఇరిగేషన్ ప్లానింగ్, అంచనాలు, డిజైన్, అంతర్ రాష్ట్ర ఒప్పందాలు తదితర అన్ని అంశాలను పరిశీలిస్తుంది. అప్పుడు లేని అభ్యంతరాలు ఇప్పుడెందుకు లేవనెత్తుతున్నారు?

పేజీ 1: *నివేదికలోని మొదటి పేజీలో ''ఇది అనేక కారణాల వల్ల సంభవించవచ్చు.''అని పేర్కొన్నారు. ఇథమిద్ధంగా కారణాన్ని చూపలేకపోయారు.*

పేజీ 2: *నివేదికలోని రెండో పేజీలో ''ఖాళీలు బహుశా సృష్టించబడి ఉండవచ్చు.'' అని సందేహాస్పదంగా భావం వ్యక్తపరిచారు.*

పేజీ 2: *నివేదికలోని రెండో పేజీలోనే ''కానీ పాటించలేనట్లుగా ఇది కనిపిస్తోంది.'' అని పేర్కొన్నారు.అడిగిన సమాచారం ఇవ్వకపోతే పాటించనట్లేనా?*

పేజీ 3: *నివేదికలోని మూడో పేజీలో ''అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులూ ఇటువంటి డిజైన్లు, నిర్మాణ పద్ధతులనే కలిగి ఉన్నాయి.'' అని పేర్కొన్నారు. దేశంలోని 6 వేల ప్రాజెక్టుల్లో ఇటువంటి డిజైన్లు, నిర్మాణ పద్ధతులను కలిగి ఉన్న డ్యామ్‌లన్నీ ఇంతేనా?*

నాడు పొగిడి.. నేడు నిందలా?

ప్రాజెక్టు నిర్మాణ సమయంలో కేంద్ర జల సంఘం చైర్మన్ సహా అనేక మంది ఉన్నతాధికారులు వచ్చి అన్ని అంశాలను పరిశీలించి ప్రాజెక్టును ఎంత పొగిడి పోయారో తెలంగాణ ప్రజలు మరచిపోలేదు. కాళేశ్వరం ప్రాజెక్టును వారు ఇంజినీరింగ్ వండర్‌గా వర్ణించి పోయారు. అన్ని జాగ్రత్తలు తీసుకున్న ప్పటికీ నది గర్భంలో జరిగే మార్పుల కారణంగా ఈ ఘటన జరిగి ఉంటుందని డ్యాం సేఫ్టీ అథారిటీ వారే నివేదికలో పేర్కొన్నారు. దురదృష్టకర సంఘటన జరిగినా బరాజ్ కుంగిపోకుండా సాగునీటి శాఖ ఇంజినీర్లు పునరుద్ధరణ చర్యలు చేపడుతున్నారు. ఇటువంటి పనులు గతంలో జరిగాయి. ఇప్పుడూ జరుగుతాయి. దేశంలో అనేక బరాజ్‌ల నిర్మాణంలో రాష్ట్ర ఫౌండేషన్ వినియోగించారు. వాటి డిజైన్లకు సంబంధించి కోడ్స్‌ను, మాన్యువల్స్‌ను కేంద్ర ప్రభుత్వ సంస్థలే జారీ చేశాయి. గంగా నదిపై నిర్మించిన ఫరక్కా బరాజ్, గోదావరిపై నిర్మించిన సర్ ఆర్థర్ కాటన్ బరాజ్, కృష్ణా నదిపై నిర్మించిన ప్రకాశం బరాజ్‌లో కూడా ఇటువంటి పిల్లర్ల కుంగుబాటు ఘటనలు జరిగాయి. వాటిని ఉమ్మడి రాష్ట్రంలో మన ఇంజినీర్లు సమర్థవంతంగా పునరుద్ధరించారు.

- కాళేశ్వరంలో కుంగినది ఒక్క బరాజ్ మాత్రమే. కేంద్ర సంస్థ నివేదికలో మాత్రం ఇతర బరాజ్‌లను కూడా ప్రస్తావించారు. ఇదే విధానంలో నిర్మించిన బరాజ్‌లు దేశంలో ఐదారు వేల వరకు ఉన్నాయి. వాటన్నింటినీ సీడబ్ల్యూసీ, సీబీఐపీ ప్రమాణాల ఆధారంగానే నిర్మించారు. మరి అవన్నీ నాణ్యత లేనివేనా?
- నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ ఏదైనా నివారణ చర్యలను సూచిస్తుందని ఆశించిన రాష్ట్ర ఇంజినీర్లకు నిరాశే మిగిలింది. ఆ సంస్థ ఏర్పాటయ్యిందే దేశంలోని డ్యాంలు, బరాజ్‌ల సంరక్షణ కోసం. వారు మాత్రం అన్ని కేంద్ర సంస్థల మాదిరిగానే కేంద్ర ప్రభుత్వ పెద్దల ప్రయోజనాలను కాపాడే దిశగా పని చేస్తున్నారని తాజా నివేదికతో తేలిపోయింది. రాష్ట్ర ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నమే తప్ప బరాజ్ పునరుద్ధరణకు నిర్మాణాత్మక సూచనలు చేయడంలో నివేదిక విఫలమైందని తేటతెల్లమవుతున్నది.

అక్కడొక న్యాయం.. ఇక్కడొక న్యాయం!

- కాళేశ్వరం ప్రాజెక్టుపై కేంద్రం కక్షపూరిత ధోరణి
- 44 ఏండ్ల కింద 25 వేల మందిని బలిగొన్న 'మచ్చు' ప్రాజెక్ట్
- ఈ డ్యామ్ దుర్ఘటనపై ఇంకా బయటకు రాని నివేదిక
- గత నెల సిక్కింలో భారీ వర్షాలకు కొట్టుకుపోయిన హైడల్ ప్రాజెక్ట్
- 175 మంది మృతి.. నెల గడిచినా ఇంకా నివేదిక బయటకు రాలే
- కాళేశ్వరం ప్రాజెక్టుపై మాత్రం వారంలోనే అసంబద్ధ నివేదిక

గుజరాత్ మోర్బీ జిల్లాలో వరదలకు తెగిపోయిన మచ్చు డ్యామ్ (ఫైల్)

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ): అది 1979వ సంవత్సరం. భారీ వర్షాలతో గుజరాత్‌లోని మోర్బీ జిల్లా అతలాకుతలమైంది. మచ్చు నదికి వరద పోటెత్తింది. దీంతో మచ్చు డ్యామ్ తెగిపోయింది. ప్రాజెక్టు కిందనున్న ఊళ్లకు ఊళ్లే కొట్టుకుపోయాయి. వరద నీటిలో ఎక్కడ చూసినా తేలుతున్న మృతదేహాలే. మొత్తంగా 25 వేల మంది మరణించారు. దేశంలోనే అత్యంత భయానక దుర్ఘటన అంటూ గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సంస్థ కూడా అభివర్ణించింది. దుర్ఘటన జరిగి 44 ఏండ్లు గడిచింది. అయితే, మచ్చు డ్యామ్ దుర్ఘటనపై సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ)గానీ, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ)గానీ ఇప్పటివరకూ ఎలాంటి సమగ్ర నివేదిక సమర్పించలేదు. అంతవరకు ఎందుకు? కిందటి నెలలోనే సిక్కింలో కురిసిన భారీ వర్షాలకు చుంగ్‌తంగ్ హైడల్ ప్రాజెక్ట్ కొట్టుకుపోయింది. మొత్తంగా 175 మంది మృత్యువాతపడ్డారు. కోట్ల ఆస్తినష్టం సంభవించింది. ప్రమాదానికి గల కారణాలపై ఇంకా ప్రభుత్వం నివేదికను విడుదల చేయలేదు. మచ్చు డ్యామ్ తెగిపోయి.. 25 వేల మంది మరణిస్తే నివేదిక లేదు. దర్యాప్తు అసలే లేదు. 2021లో డ్యామ్ సేఫ్టీ చట్టం అమల్లోకి వచ్చినా.. నిన్నటికి నిన్న.. సిక్కింలో హైడల్ ప్రాజెక్ట్ కొట్టుకుపోయి 175 మంది మరణించినా ప్రమాదానికి గల కారణాలపై ఇంకా నివేదిక బయటకు రాదు. కానీ, తెలంగాణ జలధార కాళేశ్వరం ప్రాజెక్టుపై మాత్రం కేవలం వారంలోనే అసంబద్ధమైన ఓ నివేదిక బయటకు వచ్చింది. దీన్ని బట్టి తెలంగాణ, కాళేశ్వరంపై కేంద్రం ఎంతటి కక్షపూరితంగా వ్యవహరిస్తున్నదో అర్థంచేసుకోవచ్చు.

సుప్రీంకోర్టు ఒత్తిడి తీసుకొచ్చినా..

కేరళలోని అత్యంత పురాతన డ్యామ్‌లలో ముల్లపెరియార్ ఒకటి. 2010లో రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలకు డ్యామ్ భద్రతపై ప్రజల్లో అనుమానాలు నెలకొన్నాయి. అయినప్పటికీ, సీడబ్ల్యూసీ, ఎన్‌డీఎస్‌ఏ అధికారులు పట్టించుకోలేదు. దీంతో స్పందించిన సుప్రీంకోర్టు డ్యామ్‌ను సందర్శించి పూర్తి నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. అయితే, భేటీలమీద భేటీలు నిర్వహించిన కమిటీ సభ్యులు రెండేండ్ల తర్వాత నివేదికను సమర్పించారు. 2018లో కేరళలో వరద బీభత్సం సృష్టించింది. మళ్లీ ముల్లపెరియార్ డ్యాం భద్రతపై ఆందోళన వ్యక్తమయ్యింది. వెంటనే నివేదిక ఇవ్వాలని అత్యున్నత ధర్మాసనం ఆదేశించింది. 14 సమావేశాలను నిర్వహించిన సీడబ్ల్యూసీ సభ్యులు మూడేండ్ల తర్వాత అంటే 2021లో రిపోర్ట్ ఇచ్చారు. మధ్యప్రదేశ్‌లోని కరమ్ నది మీద నిర్మిస్తున్న ధార్ డ్యామ్ గోడల్లో కిందటేడాది పగుళ్లు ఏర్పడ్డాయి. ఈ విషయాన్ని అక్కడి గ్రామస్తులు తొలుత గుర్తించారు. రెండ్రోజుల్లోనే పగుళ్లు ఏర్పడిన కొంత భాగం కూలిపోయింది. దీంతో ప్రభుత్వం గంటల వ్యవధిలో 18 గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతానికి తరలించింది. పగుళ్లకు కారణాలేంటో ఇప్పటివరకూ పూర్తి నివేదిక బయటకురాలేదు. మిగతా డ్యామ్‌లకు సంబంధించి నివేదికల సమర్పణకు ఏండ్లకు ఏండ్లు సమయం తీసుకొంటూ, కొన్ని సందర్భాల్లో అసలు నివేదికలనే విడుదల చేయని కేంద్రం.. కాళేశ్వరం ప్రాజెక్టుపై వారం వ్యవధిలోనే అత్యుత్సాహంతో ఓ అసంబద్ధ నివేదిక విడుదల చేయడం విమర్శలకు దారితీస్తున్నది.

సందర్శించకుండానే నివేదిక

ఉత్తరాఖండ్‌లో 2021లో సంభవించిన భారీ వరదలకు రిషిగంగా నదిపై నిర్మించిన 13.2 మెగావాట్ల హైడల్ ప్రాజెక్టు పూర్తిగా కొట్టుకుపోయింది. దుర్ఘటన జరిగిన 15 రోజుల తర్వాత స్పందించిన సీడబ్ల్యూసీ కమిటీ సభ్యులు.. ప్రాజెక్టు ప్రాంతంలో పర్యటించకుండానే.. ఆరు నెలల తర్వాత నివేదికను సమర్పించారు. ఇది అప్పట్లో తీవ్ర విమర్శలకు దారితీసింది.

వివిధ రాష్ట్రాల్లో జరిగిన డ్యామ్ ప్రమాదాలు

డ్యామ్ పేరు	నిర్మాణం	ప్రభుత్వం	ప్రమాదం	మరణాలు	నివేదిక వ్యవధి
మచ్చు డ్యామ్ (గుజరాత్)	1,959	జనతా పార్టీ	1979	25 వేలు	ఇంకా ఇవ్వలేదు
తివారే డ్యామ్ (మహారాష్ట్ర)	2004	బీజేపీ	2019	23	ఏడాది
హైడల్ ప్రాజెక్టు (ఉత్తరాఖండ్)	2020	బీజేపీ	2021	200 (వరదల్లో)	6 నెలలు
ముల్లపెరియార్ (కేరళ)	1895	-	2018	483 (వరదల్లో)	3 ఏండ్లు
ధార్ డ్యామ్ (మధ్యప్రదేశ్)	2017	బీజేపీ	2022	-	ఇంకా ఇవ్వలేదు
చుంగ్‌తంగ్ డ్యామ్ (సిక్కిం)	2021	ఎస్‌కేఎం	2023	175 (వరదల్లో)	ఇంకా ఇవ్వలేదు

బీజేపీ దింపుడుకల్లం ఆశలు

- తెలంగాణ బ్రాండ్ ప్రాజెక్టు కాళేశ్వరంపై రాజకీయదాడి
- ప్రధాని పర్యటనకు ముందు హడావుడిగా నివేదిక
- పడిపోయిన బీజేపీ గ్రాఫ్‌ను లేపే కుటిల రాజకీయం
- హెలికాప్టర్ పర్యటనతో రాహుల్ హైడ్రామా
- పథకం ప్రకారమే కాళేశ్వరం ప్రాజెక్టును బద్నాం చేస్తున్న రహస్య మిత్రులు

కాళేశ్వరం ప్రాజెక్ట్‌లోని భాగంగా నిర్మించిన లక్ష్మీ బరాజ్

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ): ఎన్నికల్లో ప్రజల మనసులు గెలుచుకోలేని నీచ రాజకీయమిది. నాలుగు ఓట్లు దండుకునేందుకు తెలంగాణ జీవనాడిపై జరుగుతున్న మూకుమ్మడి దాడి ఇది. పార్టీల ప్రతిష్ఠను పెంచుకొనే ఎజెండాలు లేక ప్రపంచం ప్రశంసించిన కాళేశ్వరం ప్రాజెక్టును బలిపీఠంపైకి నెట్టారు. ఒక లోపాన్ని ఆసరాగా చేసుకొని ప్రాజెక్టుపై బీజేపీ.. దాని తోక పట్టుకొని కాంగ్రెస్ పార్టీ పథకం ప్రకారం కుట్రలు సాగిస్తున్నాయి. ఇందులో భాగంగానే లోపభూయిష్టమైన నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ నివేదిక విడుదలైనట్టు స్పష్టమవుతుంది. నివేదిక వెలువడిన శుక్రవారం చోటుచేసుకున్న వరుస పరిణామాలు ఇందుకు బలం చేకూరుస్తున్నాయి. దశాబ్దాల తెలంగాణ రైతాంగ గోస తీర్చేందుకు సీఎం కేసీఆర్ అతి తక్కువ సమయంలోనే ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేశారు. నాలుగైదు సీజన్లుగా ఈ పథకం ఫలాలతోనే తెలంగాణలో సాగు విస్తీర్ణం ఊహించనిరీతిలో పెరిగింది. ఈ పథకం నిర్మాణంపై డిస్కవరీ చానల్ వంటి అంతర్జాతీయ మాధ్యమాల్లోనూ ప్రశంసల వర్షం కురిసింది. ఎంతోమంది నిపుణులు, పర్యావరణవేత్తలు చివరకు కేంద్ర జల సంఘం మాజీ చైర్మన్‌తోపాటు అనేకమంది ఇంజినీర్లు స్వయంగా వచ్చి పరిశీలించి తెలంగాణ ప్రభుత్వాన్ని అభినందించారు. 2016లో ఈ ప్రాజెక్టుకు పునాది రాయి వేసిన సీఎం కేసీఆర్ అహర్నిశలు శ్రమిస్తే 2019లో అందుబాటులోకి వచ్చింది. అంటే తాజా అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు కాళేశ్వరం ప్రాజెక్టు ఒక బ్రాండ్ అంబాసిడర్‌లాంటిది. నాలుగైదు ఏండ్లుగా ఆ ఫలాలను అందుకుంటున్న రైతాంగం, తద్వారా ప్రత్యక్ష, పరోక్ష ప్రయోజనాలు పొందుతున్న ఇతర వర్గాలు సీఎం కేసీఆర్ వెంట ఉన్నాయి. సాధారణంగా ఎన్నికల్లో ప్రజలు కృతజ్ఞతగా బీఆర్ఎస్‌కు అండగా నిలుస్తున్నారనేది జగమెరిగిన సత్యం. సరిగ్గా ఇదే ఇప్పుడు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు కంటగింపుగా మారింది.

పథకం ప్రకారమే నివేదిక విడుదల

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో మేడిగడ్డ పిల్లర్ కుంగిన ఘటనపై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) హడావుడిగా శుక్రవారం నివేదిక విడుదల చేసింది. వాస్తవానికి తెలంగాణ నీటిపారుదలశాఖ నుంచి పూర్తిస్థాయి వివరాలు రానందున ఇప్పటికిప్పుడు నివేదిక ఇవ్వాల్సిన అవసరం లేదు. కానీ, దీని వెనక పెద్ద ఎత్తున మంత్రాంగం నడిచినట్టు విశ్వసనీయంగా తెలిసింది. పీఎంవో వేదికగానే ఇదంతా కొనసాగినట్టు సమాచారం. వివరాలు వచ్చినా, రాకున్నా లోపాలు ఉన్నట్టుగా నివేదిక ఇవ్వాలని ఎన్‌డీఎస్‌ఏ బృందంపై ఒత్తిడి ఉన్నట్టు తెలిసింది. నివేదికను అడ్డం పెట్టుకొని తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందేందుకు బీజేపీ పథకం రచించింది. ప్రధాని మోదీ తెలంగాణ పర్యటనకు ముందే నివేదికను రూపొందించి బయటికి వదిలారు. కేవలం ఆరు గంటల పరిశీలనతో డాక్యుమెంట్లు ఏవీ లేకుండానే ఎన్‌డీఎస్‌ఏ నివేదిక ఇవ్వడం ఇంజినీరింగ్ నిపుణులను విస్మయానికి గురి చేస్తున్నది. విపక్ష నేతలు మిడిమిడి జ్ఞానంతో చేసిన ఆరోపణలనే సాంకేతికంగా ఎన్‌డీఎస్‌ఏ తన నివేదికలో పేర్కొనడం గమనార్హం. నివేదిక రాబోతున్నదని శుక్రవారం ఉదయం 10.30 గంటలకు బీజేపీ రాష్ట్ర నేతలకు స్పష్టమైన సమాచారం ఉన్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. పథకం ప్రకారం నివేదికను తెలంగాణ నీటిపారుదలశాఖకు అధికారికంగా పంపకుండా బీజేపీ నేతలు.. తద్వారా కాంగ్రెస్ నేతలు, మీడియాకు లీక్ చేశారు. అనంతరం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఒకవైపు, కాంగ్రెస్ నేతలు మరోవైపు దీనిపై వరుసగా ఆరోపణలు చేయడంతో పాటు కాళేశ్వరం పథకాన్ని బద్నాం చేసేందుకు పెద్ద ఎత్తున దాడి చేశారు. నివేదిక రాక ముందు, వచ్చిన తర్వాత ఇరు పార్టీల నేతల ఆరోపణలు, విమర్శలు ఒకేలా ఉండడం గమనార్హం.

బీజేపీ గ్రాఫ్‌ను పెంచే తంటాలు

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం కోసం మోదీ 7న రాష్ట్రానికి వస్తున్నారు. ఇందుకోసమే హడావుడిగా ఈ నివేదికను విడుదల చేసినట్టు తెలుస్తున్నది. దీనిని అడ్డంపెట్టుకుని తెలంగాణ ప్రభుత్వం, సీఎం కేసీఆర్‌పై రాజకీయంగా మోదీ దాడి చేయనున్నారు. వాస్తవానికి రాష్ట్రంలో అంతంత మాత్రంగానే ఉన్న బీజేపీ గ్రాఫ్ గణనీయంగా పడిపోయింది. కీలక నేతలు ఒక్కొక్కరుగా పార్టీని వీడుతున్నా.. ఇతర పార్టీల నుంచి ఒక్కరంటే ఒక్కరు కూడా వచ్చి చేరకపోవడం ఢిల్లీ పెద్దలను కలవరపెడుతున్నది. ఈ నేపథ్యంలోనే కాళేశ్వరం ప్రాజెక్టును రాజకీయ బలిపీఠంపై పెట్టి రాజకీయ దాడికి పథక రచన చేసింది. ఈ పరిణామాలన్నీ అందులో భాగమేనని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. 2022లో మేడిగడ్డ బరాజ్ డిజైన్ డిశ్చార్జి 28.25 లక్షల క్యూసెక్కుల కంటే అదనంగా 50వేల క్యూసెక్కుల వరద వచ్చినప్పటికీ చెక్కు చెదరకుండా నిలబడింది. ఆ విషయం తెలిసినా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మేడిగడ్డ బరాజ్ ఫౌండేషన్ సరిగా లేదని అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్నారు.

అదే పనిగా కాంగ్రెస్ హైడ్రామా

**సిద్ధాంతపరంగా విరుద్ధమని చెబుతున్నప్పటికీ తెలంగాణలో బీజేపీ, కాంగ్రెస్‌లు రహస్య మిత్రులుగానే కొనసాగుతున్నాయని కాళేశ్వరం అంశం మరోసారి రుజువు చేసింది. కొన్నిరోజులుగా ఇదే అంశంపై మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి, ఇతర బీజేపీ నేతలు, అటు రాహుల్‌తో పాటు ఇతర కాంగ్రెస్ నాయకుల వ్యాఖ్యలు ఒకేలా ఉంటున్నాయి. నివేదిక రూపొందించిన రోజే ఈ నెల ఒకటో తేదీన రాహుల్‌గాంధీ మేడిగడ్డ బరాజ్ వద